విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 15 ఆగస్టు 2024 8 పేజీలు

ఏటిగట్లను పటిష్ట పరచండి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-యలమంచిలి: దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం గ్రామాల్లో బలహీనంగా ఉన్న ఏటి గట్లను పటిష్టపరిచేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడ పాలెం గ్రామాల్లో బలహీనంగా ఉన్న ఏటిగట్లను ఆకస్మికంగా సందర్శించి, స్థానికులతో మాట్లాడిన అనంతరం అధికారు లకు పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏటిగట్లు చాలా బలహీనంగా ఉన్నాయని, రానున్న అక్టోబర్, నవంబరు మాసాలలో అల్ప పీడనాల కారణంగా అధిక వర్షాలు కురిస్తే గోదావరికి వరద వచ్చే అవకాశం ఉందని, పరిస్థితులను ముందే చక్కదిద్దవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దొడ్డిపట్ల, వాకాలగరువు ప్రాంతంలో సుమారు 700 మీటర్ల పరిధిలో రూ.2.2 కోట్లు, అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, లక్ష్మీ పాలెం, యలమంచిలి ప్రాంతాల్లో 1800 మీటర్ల

▶మిగతా 2లో..

మత్తు పదార్థాలతో అనర్థాలు

ఏఎస్పీ సూర్యచంద్రరావు

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాల గురించి కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏలూరు జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అదనపు ఎస్పి ఎన్.సూర్య చంద్ర రావు అన్నారు. మాదకద్రవ్యాల నిరోధానికి ప్రభుత్వం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వీటి నిరోధా నికి ప్రత్యేక చట్టాలు సైతం రూపొందించినట్టు తెలి పారు. బుధవారం ఏలూరులోని సెయింట్ థెరీసా మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ ఆర్ఐఓ ఏసిహెచ్ ఎస్.బాబు ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాలో ఉన్న కళాశాలల ప్రిన్సిపాల్స్తో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అద నపు ఎస్పీ సూర్యచంద్ర రావు మాట్లాడుతూ దేశానికి వెన్నుముకగ్గా నిలిచే యువశక్తిని నిర్వీర్యం చేసే మత్తు పదార్థాలను తరిమికొట్టా లని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వల్ల విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటారని, సరదాగా ప్రారంభమవుతున్న ఈ మత్తు పదార్థాల వినియోగం భవిష్యత్తులో వ్యసనంగా మారి వారి జీవితాలను సర్వనాశనం చేస్తుందన్నారు. ఈ మత్తు పదార్థాలు విని యోగం వల్ల శరీరంలో సత్తువ నశించి, నాడీ వ్యవస్థను కృంగతీస్తుందని వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థినీ విద్యార్థులకు కళాశాలలో ప్రిన్సిపల్స్, అధ్యాపకులు తరచూ అవగాహనను కల్పించాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన యువత కోసం జిల్లాలోని (03) డీ-అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇలాంటి డీ-అడిక్షన్ సెంటర్లు మండల స్థాయిలో ఏర్పాటు చేయాలని కొందరు ప్రిన్సిపల్స్ కోరగా ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారి దృష్టికి తీసుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్ర మంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ సిహెచ్. అరుణమ్మ, స్పెషల్ బ్యూరో ఎస్సై పి.శివప్రసాద్, ప్రభుత్వాసుపత్రి సైకాలజిస్ట్ సిహెచ్. వంశీకృష్ణ, పోలీసు అధికారులు, 70 మంది కాలేజీ ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ పతాక ఔన్నత్యాన్ని చాటిచెప్పాలి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : జాతీయ పతాకం ఔన్నత్యాన్ని, ప్రాధాన్యతను చాటి చెప్పేందుకు, ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించే లక్ష్యంతో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఏలూరులో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహిం చారు. ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద ఈ ర్యాలీని ఎమ్మెల్యేలు బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు, డాక్టర్ కామినేని శ్రీనివాస్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ప్రారంభించారు. జాతీయ సమైక్యత చాటిచెప్పేలా కొనసాగిన ఈ బైక్ ర్యాలీ వివిధ ప్రాంతాల మీదుగా జూట్‌మిల్లు సెంటర్‌లోని అల్లూరి సీతారామ రాజు విగ్రహం వరకు కొనసాగి తిరిగి ఇండోర్ స్టేడియంకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ జాతీయ సమైక్యత, సమగ్రతను కాపాడడం దేశ పౌరులుగా ప్రతి ఒక్కరి బాధ్యతని స్పష్టం చేశారు. అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగమైన హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇళ్ళపై జాతీయ జెండాలను ఎగురవేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ జాతీయ

సమైక్యత చాటి చెప్పేలా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ ఆర్ విజయరాజు, జెడ్పీ సీఈవో సుబ్బారావు, ఆర్డీవో ఎన్ఎస్కె ఖాజావలి, డీఎస్పీ శ్రావణ్ కుమార్, డీఎస్‌డీవో శ్రీనివాసరావు, ఏలూరు తహశీల్దార్ శేషగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి హెల్మెట్లు ధరించాలని సందేశమిస్తూ, బైక్‌లు నడిపి అందరిలో ఉత్సాహాన్ని నింపారు.

సహకార సంఘాలలో
లావాదేవీలు కంప్యూటరీకరణ

- సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు
- జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలోని అన్ని సహకార సంఘాలలోని లావాదేవీలు పూర్తి స్థాయిలో కంప్యూటరీకరణ చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సహకార శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో సహకార సంఘాల వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. రాబోయే 5 సంవత్సరాలలో పెద్ద సంఖ్యలో

▶మిగతా 2లో

స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లు...
కలెక్టర్, ఎస్పీ పెరేడ్ రిహార్సల్స్

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : 78వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించే క్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం ఎస్పీ డి.నరసింహకిషోర్‌తో కలసి పెరేడ్ రిహార్సల్స్ కలెక్టర్ పి.ప్రశాంతి పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాలను నిర్వహించేందుకు ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌ను ఎస్పీతో కలసి పరిశీలించినట్టు చెప్పారు. జిల్లా మంత్రి, రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా జాతీయ జెండా ఎగురవేయ నున్నట్టు పేర్కొన్నారు. వేడుకలకు వచ్చే అతిథులు సభావేదిక, తదితర ఏర్పాట్లను పరిశీలించామన్నారు. స్టేజ్ ఏర్పాటు బారికేడింగ్, వేడుకలు తిలకించేందుకు వచ్చే విద్యార్థులకు గ్యాలరీలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నాం 12 గంటల వరకు వేడుకలు

▶మిగతా 2లో

ఏపీ నిట్ బీటెక్‌లో 453 మంది ప్రవేశాలు

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఏపీ నిట్)లోని బీటెక్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి బుధవారం నాటికి 453 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. మొత్తం 8 కోర్సులకు 480 సీట్లు ఉండగా ఇటీవల జోసా నిర్వహించిన మొదటి రౌండ్లోనే అన్ని సీట్లకు అలాట్ మెంట్ (కేటాయింపులు) పూర్తయ్యాయి. సీటు అలాట్‌మెంట్ పొందిన విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రాంగణానికి వస్తున్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకోవటంతో పాటు ఫీజులను చెల్లించి సీటును నిర్ధారించు కుని ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్నారు. ఈ ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని జోసా, సి సాబ్ మరో రెండు రోజులు పొడిగించడంతో మరికొంతమంది విద్యార్థులు రానున్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఈ నెల 16న ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సెంటర్ ఇన్‌చార్జిలు తపస్ పరమానిక్, డాక్టర్ రాముడు మాచవరపు, ఆచార్యులు డాక్టర్ కిరణ్ తీపర్తి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ సుదర్శన్ ధ్రువ, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ అమరేంద్ర రెడ్డి, డాక్టర్ శరద్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర -భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వితంతు పింఛను కు దరఖాస్తు చేసుకుని అన్ని అర్హతలు ఉండి పింఛను రాకపోతే భీమవరం మండల న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందజేసి వితంతు పింఛను అందేలా చర్యలు తీసు కుంటామని ప్యానల్ న్యాయవాదులు తెలిపారు. వితంతు పింఛన్లపై 25వ వార్డు సచివాలయంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ న్యాయవాదులు మాట్లాడుతూ వితంతువులు తమ హక్కులను కాపాడుకోవాలని ఎటువంటి న్యాయం కావాల్సిన మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించాలని వారు సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు ఎన్.సుధీర్, కె.జ్యోతి, డి.రవికిరణ్, వార్డు అడ్మిన్ పెంటకోటి బాలాజీ వెంకటేశ్వరరావు, ఎడ్యుకేషన్ సెక్రటరీ తాంద్ర నాగేశ్వరరావు, ప్లానింగ్ సెక్రటరీ మద్దాల తాతాజీ శశాంక్, హెల్త్ సెక్రటరీ తిరుమాని కనకదుర్గ, రెవెన్యూ సెక్రటరీ కొప్పర్తి ప్రియా కుమారి, వెల్ఫేర్ సెక్రటరీ బాజంకి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ట్రిబుల్ ఐటీలో మెషిన్ లెర్నింగ్ ప్రోగ్రాం

విశాలాంధ్ర- నూజివీడు : నూజివీడు ట్రిబుల్ ఐటీ లో ఈసీఈ విభాగం "మెషిన్ లెర్నింగ్" లో మైనర్ డిగ్రీ ప్రోగ్రాం ప్రారంభోత్సవాన్ని నిర్వహించింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ' మెషిన్ లెర్నింగ్‌ను అర్థం చేసు కోవడం వల్ల ఈ సాంకేతి కతలు ఎలా పనిచేస్తాయి,అవి భవిష్యత్తును ఎలా రూపొందిస్తున్నాయో గ్రహించడానికి కావలసిన జ్ఞానాన్ని అందిస్తుంది అన్నారు.మెషిన్ లెర్నింగ్ ఆరోగ్య సంరక్షణ, ఫైనాన్స్, ఆటోమోటివ్, వినోదం వంటి అనేక పరిశ్రమలలో ఉపయోగించబడుతుందన్నారు. పర్సనలైజ్డ్ మెడిసిన్, మోసాలను గుర్తించడం నుండి సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల వరకు, మెషిన్ లెర్నింగ్ ఆవిష్కరణ సామర్థ్యాన్ని నడిపిస్తోంది అని,మెషిన్ లెర్నింగ్ నైపుణ్యం కలిగిన నిపుణులకు ఎంతో డిమాండ్ ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రవేశపెట్టిన ఈసీఈ విభాగాధిపతి పి.శ్యామ్‌ను ఆయన అభినందించారు.

కొనసాగుతున్న ఏరియా ఆస్పత్రి సిబ్బంది ఆందోళన

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం : మూడు నెలల జీతం బకాయిలు వెంటనే చెల్లించని పక్షంలో అవసరమైతే సమ్మెకు దిగుతామని ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు హెచ్చరించారు. తమ జీతం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏరియా ఆస్పత్రి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సాగిస్తున్న ఆందోళన బుధవారం మూడో రోజుకు చేరింది. ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ధర్నా నుద్దేశించి ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ జీతాలు రాకపోవడంతో కార్మికులు అప్పులపాలై నానా యాతనలు పడుతున్నారని, చేసిన పనికి జీతాలు ఇవ్వకపోతే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. అవసరమైతే సమ్మె నోటీసు ఇచ్చి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.లక్ష్మీ నారాయణ (కే.ఎల్.), మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ జీతాల బకాయిలు వెంటనే చెల్లించేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్ నాయకులు గెడ్డం సురేష్, ధనాల అప్పారావు, రమణమ్మ, చిన్ని కుమారి, మయూరి, పచ్చిపాల పద్మ, బద్దిరెడ్డి వాణి, తదితరులు నాయకత్వం వహించారు.

రిహార్సల్స్

(1వ పేజీ తరువాయి)

నిర్వహించే క్రమంలో, ఎటువంటి అసౌకర్యం కలుగ కుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం వివిధ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులు జాతీయ స్ఫూర్తిని నింపే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. తొమ్మిది శాఖలు మెప్మా డిఆర్డిఏ, ఐసిడిఎస్, మత్స్య శాఖ, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్, పౌరసరఫరాలు, పర్యాటక, సహకార రంగం8, బ్యాంకింగ్, పరిశ్రమల కు చెందిన శకటాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్పీ డి.నరసింహకిషోర్ మాట్లాడుతూ, సభ ప్రాంగణంలో వివిఐపిలకు, ప్రజలకు ప్రవేశ మార్గాలు వేర్వేరుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేడుకల్లో పోలీసు కవాతు, సాయిధ దళాలు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని చెప్పారు ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

కంప్యూటరీకరణ

(1వ పేజీ తరువాయి)

మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీలు, ప్రైమరీ ఫిషరీ సొసైటీలు, డెయిరీ కోఆపరేటివ్ సొసైటీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదన్నారు. జిల్లాలో సహకార ఉద్యమాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడం ద్వారా సహకార రంగంలో స్థిరమైన ఆర్థిక అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి వీలుకలుగుతుందని, అధికారులు ఈ దిశగా పనిచేయాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పెట్రోల్ బంకు లు, ధాన్యం నిల్వ గోడౌన్ లు, ఈ-సేవా వంటి కామన్ సర్వీస్ కేంద్రాలు వంటివి ఏర్పాటుచేయడం ద్వారా వాటిని మరింత ఆర్థిక పరిపుష్టి దిశగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, అర్బన్ సహకార బ్యాంకులు, ఉద్యోగుల సహకార పరపతి సంఘాలు, పాడిరైతులు, గొర్రెల పెంపకం దారుల, మత్స్యకారులు, తదితర సహకార సంఘాలు, సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలోని సంఘాలు, తదితర అన్ని సంఘాలు కలిపి జిల్లాలో 882 సహకార సంఘాలున్నాయన్నారు.

సదరు సహకార సంఘాల సక్రమ నిర్వహణ నిమిత్తం అందుకు తగిన విధంగా వాటిలో జరిగే సభ్యత్వం, డిపాజిట్లు, రుణాలు, పెట్టుబడులు, తదితర లావాదేవీలు అన్నీ నిర్దేశించిన సమయంలో కంప్యూటరీకరణ చేయాలన్నారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, వ్యవసాయ, మత్స్య శాఖ జేడీలు హబీబ్ భాష, నెహ్రూ బాబు, డిపిఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, నాబార్డ్ డిసిఎం అనిల్ కాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పటిష్టపరచండి

(1వ పేజీ తరువాయి)

పరిధిలో రూ.4.47 కోట్లు వ్యయంతో ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామన్నారు. త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని, ఏటిగట్ల పటిష్టతకు అవసరమైన అడ్డంకులను తొలగించేందుకు చర్యలు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ 2022 సంవత్సరంలో వచ్చిన గోదావరి వరదలు గట్టుపై నాలుగు మీటర్లు ఎత్తున ప్రవహించిందని, గతంలో కొందరి స్వార్థం కొరకు ఏటి గట్లను ప్రొక్లైన్ తో చదును చేయడం కారణంగా ఏటిగట్లు మరింత బలహీన పడ్డాయని కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం. అచ్యుత అంబరీష్, ఎస్ఈ ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ జి.శ్రీనివాస్, ఈఈ ధవళేశ్వరం హెడ్ వర్క్ డివిజన్ శ్రీనివాస్, డీఈ సబ్ డివిజన్ రాజోలు శ్రీనివాస్, తహసీల్దార్ బాజీ సత్యనారాయణ, డిటి డేవిడ్ సన్, స్థానికులు సిహెచ్ రవిశంకర్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ రిజిస్టర్డ్ వీలునామా దస్తావేజు పోయినది

కొల్లా భానుమూర్తి, S/O కొల్లా నారాయణమూర్తి, మెంటేపూడి (గ్రా), వీరవాసరం (మం), పశ్చిమగోదావరి జిల్లా, మా పెదనాన్న గారి కుమార్తె అడ్డాల సతీదేవి నాకును, కోయ సత్యనారాయణ కుమారుడు కోయ వెంకటేశ్వరరావు కు ది.06.07.1997వ తేదిన రిజిస్టర్ చేయించిన ఒరిజినల్ వీలునామా దస్తావేజు నెం.**51/1997** ను ఒక కవర్లో పెట్టుకుని ది.26.06.2024 తేదిన జిరాక్స్ తీయు నిమిత్తం మా ఇంటి వద్ద నుండి వీరవాసరం సెంటరుకు వెళ్తుండగా మార్గ మధ్యంలో కవర్లోని సదరు ఒరిజినల్ రిజిస్టర్డ్ వీలునామా దస్తావేజు జారి పడిపోయినది. నేను మరలా మార్గమధ్యంలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ఎంత వెదికినా ఆ ఒరిజినల్ రిజిస్టర్డ్ వీలునామా దస్తావేజు దొరకలేదు.

సదరు ఒరిజినల్ రిజిస్టర్డ్ వీలునామా దస్తావేజు దొరికినవారు పైన తెలిపిన అడ్రస్సులో అందచేయ ప్రార్థన.

లింగపాలెం మండల తహశీల్దార్‌గా నజీమ్

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండల తహశీల్దార్‌గా ఎం.డి నజీమ్ ఉల్లాషా బుధ వారం బాధ్యతలు చేపట్టారు. ఏఎస్ఆర్ జిల్లా చింతూరు మండలంలో పనిచేసిన ఈయనను ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి లింగపాలెం మండలానికి తహశీల్దార్‌గా నియమించారు. బాధ్యతలు తీసు కున్న ఈయన రెవెన్యూ కార్యదర్శు లు, సర్వేయర్లు, కార్యాలయపు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ విధులు సక్రమంగా నిర్వర్తించి మండలానికి మంచిపేరు తేవాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగుల ద్వారా ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకూడదనేదే తన ఆశయమని ఈయన పేర్కొన్నారు.

ఉత్తమ తహశీల్దారుగా అవార్డు: లింగపాలెం మండల తహశీల్దారుగా బాధ్యతలు తీసుకున్న నజీమ్ ఉల్లాషాను ఏఎస్ఆర్ కలెక్టర్ దినేష్ కుమార్ ఉత్తమ తహశీల్దారుగా ఎంపిక చేశారు. చింతూరు మండలంలో జూలైలో వచ్చిన వరదలలో ఈయన చేసిన సేవలకుగాను అవార్డుకు ఎంపిక చేశారు. ఉత్తమ తహశీల్దారుగా ఎంపిక చేసిన ఈయనను రెవెన్యూ ఉద్యోగులు అభినందించారు.

లింగపాలెం మండల ఎంపీడీవో నియామకం

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండల పరిషత్ ఎంపీడీవోగా ఎస్.ఆశీర్వాదం బాధ్యతలు చేపట్టారు. ఎన్నిక లకు ముందు ఇదే మండలంలో పనిచేస్తూ ఎన్నికల నిబంధన లకు అనుగుణంగా ఎన్టీఆర్ జిల్లాలోని రెడ్డిగూడెం మండలా నికి బదిలీపై వెళ్లారు. తిరిగి ఈయనను ఇదే మండలంలోని ఎంపీడీవోగా అధికారులు నియమించారు.

నగరపాలక సంస్థ దోమల నివారణ

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధా కృష్ణయ్య (చంటి) ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం వారితో 20వ డివిజన్‌లోని ఎన్ ఆర్ పేట రైల్వే ట్రాక్ రోడ్, ఏటిగట్టు రోడ్డు, ఎన్ఆర్ఐ కాలేజ్ రోడ్, ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ రోడ్, తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాలలో ఉన్న నిలవనీటిలో ఆయిల్ బాల్స్ వేసినట్టు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కార్యక్రమంలో నాయకులు ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణు గోపాల్ స్వామి, మలేరియా మేస్త్రి డి. దుర్గారావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ బి.ఏడుకొండలు, ఆరోగ్యకార్యదర్శి, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

నూజివీడులో అన్న క్యాంటీన్ ప్రారంభం

విశాలాంధ్ర- నూజివీడు : రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల పునః ప్రారంభంలో భాగంగా గురువారం నూజివీడులోని అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు. స్థానిక ఆర్ఆర్ పేటలోని అన్నా క్యాంటీన్ ప్రారంభ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 12 గంటలకు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చేయనున్నారు. ఈ అన్నా క్యాంటీన్ ద్వారా ప్రతిరోజు రెండు పూటలా 350 మందికి భోజనాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నూజివీడు మున్సిపల్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

గ్రామీణ ప్రాంతాలలో క్రీడలను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-లింగపాలెం: గ్రామీణ ప్రాంతాలలోని యువత క్రీడల పట్ల ఆకర్షితులు కావాలని ధర్మాజీగూడెం ఏఎస్ఐ రాంబాబు తెలిపారు. సుందరరాజుపేటలో దేవరపల్లి విఘ్నేశ్వరి మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ఈయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రమశిక్షణగా పెరగటానికి, చెడు అలవాట్లకు దూరంగా ఉండటానికి క్రీడలు దోహద పడతాయని అన్నారు. ఏడేళ్లుగా గ్రామంలో వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులు దేవరపల్లి తంబిని ఈయన అభినందించారు. క్రీడలతో పాటు స్వగ్రామమైన సుందరరాజుపేటలో ఆడపిల్ల జన్మిస్తే వారి పేరిట రూ5,116లను డిపాజిట్ చేయటాన్ని ప్రశంసించారు. ఇప్పటికీ 14 మంది పిల్లలకు ఇటువంటి సహాయం చేశారనితెలిపారు. ఈ టోర్నమెంట్లో చింతలపూడి, లింగపాలెం మండల పరిధిలో వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమంలో క్రీడల నిర్వాహకులు దేవరపల్లి తంబి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన బోధి పరిశీలన

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఉంగుటూరు మండలం గొల్లగూడెం గ్రామంలో భీముడు చెరువు నుండి మొగ్గల్లా చెరువు వరకు వరద నీరు ప్రవహించే మురుగు బోదీ ఆక్రమణ గురైందని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణలతో ఆర్అండ్‌బీ రోడ్డు, రైతుల పొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. స్థానికుల ఫిర్యాదులతో బుధవారం అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న కారు.. ఇరువురికి గాయాలు

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నారాయణపురం- ఉంగుటూరు జాతీయ రహదారి మధ్య బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ద్వారకాతిరుమల నుండి తాడేపల్లిగూడెం వైపు వెళుతున్న కారు ముందు వెళ్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ పై ఉన్న ఎ. నాగార్జున, వి సతీష్ గాయపడ్డారు. వీరిని హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో తరలించారు. గాయపడిన వారు భీమడోలు మండలం పూళ్ళ గ్రామానికి చెందినవారు.

చెత్త నిర్మూలనకు పటిష్ట చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-పాలకొల్లు: చెత్త నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపట్టాలని, నగరం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి పాలకొల్లు 12వ వార్డు యడ్లబజారులో ఉన్న డంపింగు యార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏళ్ల తరబడి పేరుకు పోయిన చెత్తను ట్రీట్మెంటు ప్లాంటు ద్వారా నిర్మూలిస్తున్న విధానాన్ని పరిశీలించి పలు సూచనలు జారీచేశారు. భూగర్భ జలాలు కలుషితం కావడంతోపాటు, ప్రజల ఆరోగ్యంపై చెత్త ప్రభావం ఎక్కువగా ఉంటుందని ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా చెత్తను త్వరితగతిన నిర్మూలన చేయాలన్నారు.

అనంతరం వచ్చిన మట్టిని ఖాళీ స్థలాలు మెరక చేసేందుకు వినియోగించాలన్నారు. పాలకొల్లు పట్టణంలో 25 వేల మెట్రిక్ టన్నుల చెత్తను ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా నిర్మూలన చేసేందుకు రూ.1.93 కోట్ల రూపాయల ప్రాజెక్టును ప్రభుత్వం ఏజెన్సీకి అప్పగించినట్టు తెలిపారు. కోళ్ల వ్యర్థాలు, కొబ్బరి బొండాలు, తదితర వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ వేయకుండా వాటిని భద్రపరిచి ప్రతి రోజు చెత్త సేకరణ సమయంలో అందజేయాలని మైక్ అనౌన్స్మెంట్ ద్వారా తెలియజేయాలన్నారు కలెక్టరు వెంట నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్, మున్సిపల్ కమిషనరు బి.విజయ సారథి, తహశీల్దారు యర్రంశెట్టి దుర్గా కిషోర్, డిఇ కె.రాజ్ కుమార్, టిపివో కె.వీరబ్రహ్మం, ఏఇలు యం.సాంబశివుడు, జి.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పోస్ట్ బేసిక్ స్కూలుకు పూర్వ విద్యార్థి సహకారం

విశాలాంధ్ర-పెంటపాడు:పెంటపాడు గ్రామంలో ప్రభుత్వ పోస్ట్ బేసిక్ పాఠశాల 1985-86 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థి కర్రి సురేష్ రెడ్డి వారి సతీమణి, ఝాన్సీ, కుమారుడైన ప్రణయ్ శ్రీకర్ రెడ్డి జయంతి పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు మిఠా యిలు, బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రధాన ఉపాధ్యాయులు ఎన్. రాజేష్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కళింగ లక్ష్మణరావు పాల్గొని కర్రి సురేష్ రెడ్డి పాఠశా లకు చేస్తున్న సేవలను వారు ప్రశంసించారు. ఆయన స్కూల్లో సైకిల్ షెడ్‌కు రూ.1లక్ష 20 వేలుతో ఏర్పాటు చేశారన్నారు. స్కూల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు రూ.60 వేలతో ఏర్పాటు చేశారన్నారు.2023 పదవ తరగతి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి రూ.10వేల చొప్పున అందజేసి దాతృత్వం చాటారన్నారు. ఉద్యోగరీత్యా అమెరికాలో నివాసం ఉంటున్నప్పటికీ చదివిన స్కూలుకు తన వంతు అభివృద్ధి చేయాలని కాంక్షతోఆయన సేవలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ రెడ్డి మిత్ర బృందం, ఉప సర్పంచ్ కొవ్వూరు ప్రసాద్ రెడ్డి, సత్తి వెంకటరెడ్డి, పడాల మురళీమోహన్ రెడ్డి, తేతల గంగాధర్ రెడ్డి, కొవ్వూరి సుధారాణి, పార్వతి, లక్ష్మి వీరంతా పాఠశాల1985-6 పదో తరగతి పూర్వ విద్యార్థులు బ్యాచ్ కావడం చదువుకున్న కృతజ్ఞతతో సేవలు అందించడం ఆనంద దాయక మని రైతు సంఘం రాష్ట్ర నాయకులు నల్లమిల్లి విజయ్ ఆనంద్ రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బండారు శ్రీనివాసరావు,పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆసుపత్రి ఏర్పాటు అభినందనీయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఏజెన్సీ ముఖద్వారం పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం పట్టణంలో, అభిషా పిల్లల ఆసుపత్రి ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని, పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు, గోపాలపురం నియోజకవర్గ శాసన సభ్యులు మద్దిపాటి వెంకటరాజు, డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, పోలవరం మాజీ శాసనసభ్యులు మొడియం శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అభిషా పిల్లల ఆసుపత్రిని ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రజా ప్రతినిధులు ప్రారంభిం చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో పిల్లల ఆసుపత్రులు లేక వైద్యం కోసం ఇతర పట్టణాలు వెళ్ళాల్సి వస్తుందని, పిల్లలకు మంచి వైద్యం అందించాలని పిల్లల వైద్యులు అశోక్,సుమంత్ లకు సూచించారు. ప్రజా ప్రతినిధులతో వైద్యులు మాట్లాడుతూ పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, డిపార్ట్మెంట్ అందుబాటులో ఉంటారని, అత్యాధునిక సదుపాయాలతో ఎన్.ఐ.సి.యు, పి. ఐ. సి. యు, నిరంతరాయంగా అత్యవసర సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు తోట రవి,టిడిపి పట్టణ అధ్యక్షుడు జేష్ఠ రామకృష్ణారావు, జనసేన పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, ముప్పిడి చిన్నబాబు, మేనేజింగ్ డైరెక్టర్ దూలపల్లి సత్యవతి,వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

విశాలాంధ్ర -భీమవరం: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలు, ఆర్పీలు, సిబ్బంది బుధవారం ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో ఇంటింటా మువ్వన్నెల జెండా ఎగరాలన్నారు. స్వాతంత్ర్య సమర యోధులను స్ఫురణకు తెచ్చుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, సిటీ మిషన్ మేనేజర్ సిహెచ్ నానిబాబు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఆర్పీలు స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటా జాతీయ జెండా ఎగరాలి

విశాలాంధ్ర -భీమవరం: ప్రతి భారతీయుడిలో దేశ భక్తి పెంపొందించేలా హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమాలను స్ఫూర్తివంతంగా నిర్వహించు కుంటున్నామని ఇంటింటా జాతీయ జెండా ఎగరాలని ఆర్.ఆర్.డి. ఎస్.ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన అన్నారు. ఆర్.ఆర్.డి.ఎస్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాతీయ సమైక్యతను, సమగ్రతను కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. యువత భాగస్వామ్యులు కావాలని దేశ సమగ్రతను కాపాడే ఈ మహోన్నత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేసి దేశభక్తి పెంపొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం స్వాతంత్రోద్యమంలో గ్రంథాలయాల పాత్ర అనే అంశంపై కళాశాల గ్రంథాలయాధికారి ఎల్.నరసింహం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీకాంతం, ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు, డాక్టర్ అరవింద స్వామి, డాక్టర్ పి.రాజశేఖర్, డాక్టర్ ధనుంజయ్, అధ్యాపకులు జి.ఉమా మహేశ్వరి, పి.అమూల్యారావు, సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర - గణపవరం: బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ గణపవరం సెక్టర్ సూపర్వైజర్ పి. తులసి అన్నారు. బుధవారం గణపవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మిషన్ శక్తి 100 రోజులు కార్యక్రమం జరిగింది. సూపర్వైజర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేకుండా బాల్య వివాహాలు చేస్తే వరుడుకు ఏడు సంవత్సరాలు, తల్లిదండ్రులకు రెండు సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధిస్తారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వై కె వి అప్పారావు, ఎంపీడీవో కె సూర్యనారాయణ, ఎంఈఓ పుచ్చల శేషు, ఏఎస్ఐ చింతకాయల నారాయణ, ఐ సిడిఎస్ సూపర్వైజర్లు గుమ్మడి చంద్రావతి, సిహెచ్ దుర్గ భవాని, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సెక్రటరీలు వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు కొయ్యలగూడెం దంపతులకు ఆహ్వానం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : గ్రామానికి చెందిన పొట్టి పోతుల పోతురాజు,నాగమణి దంపతులు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీ నడిబొడ్డున ఎర్రకోటలో ప్రధాని సమక్షంలో నిర్వహించే జాతీయ పతాక ఆవిష్కరణకు ఆంధ్ర రాష్ట్రం, ఏలూరు జిల్లా కొయ్యలగూడెం గ్రామానికి చెందిన, ఇరువురు దంపతులు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొంటున్నారు. దంపతులు ఇద్దరినీ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. సేంద్రియ వ్యవసాయ విధానాన్ని నిర్వహిస్తున్నందుకు, కేంద్రం నుంచి ఆహ్వానం అందిందని పోతురాజు పేర్కొన్నారు.

ఏలూరు నగర ట్రాఫిక్ ఎస్ఐగా రంగారావు

విశాలాంధ్ర- ఏలూరు: ఏలూరు నగర ట్రాఫిక్ ఎస్ఐ గా టీఏస్ రంగారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 1988లో కానిస్టేబుల్‌గా రంగారావు ఉద్యోగంలో చేరి రాజ మండ్రిలో పనిచేశారు. 2012లో హెచ్‌సిగా పదోన్నతి పొంది రావుల పాలెంలో పనిచేశారు. 2012లో ఏఎస్ఐగా పదోన్నతి పొంది కోనసీమ జిల్లా అంగర, మండపేటలలో పనిచేశారు. ఇప్పుడు ఎస్ఐగా పదోన్నతి పొంది ఏలూరు ట్రాఫిక్ ఎస్ఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఏలూరు నగర ప్రజలకు ట్రాఫిక్ వల్ల వచ్చే ఇబ్బందులు తొలగించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు కోరారు. మండలంలో దిప్పకాయలపాడు గ్రామంలో నాల్గవ వార్డులోని బళ్ల రామస్వామి ఇంటి వీధిలో డ్రైనేజీ సమస్య అస్తవ్యస్తంగా ఉందని, దిప్పకాయలపాడు గ్రామపంచాయతీ కార్యదర్శి అనిల్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ సిసి రహదారులు ఏర్పాటు చేసి, నూతన డ్రైనేజీ నిర్మించాలని, పలు సమస్యలను కార్యదర్శికి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి చిక్కిరెడ్డి సోమరాజు, బళ్ళ నాగేశ్వరరావు, లక్ష్మీ శెట్టి శ్రీను, పాల్గొన్నారు.

పరకాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నేడు స్వాతంత్ర్య వేడుకలు

విశాలాంధ్ర -పోడూరు: మండలంలోని కవిటంలో పరకాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పరకాల ట్రస్ట్ భవనం వద్ద, మహిళా సంఘం భవనం వద్ద గురువారం స్వాతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పరకాల ట్రస్ట్ అధ్యక్షులు పరకాల సూర్య మోహన్ తెలిపారు. పరకాల ట్రస్ట్ భవనంలో సోమవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ముచ్చటిస్తూ పరకాల ట్రస్ట్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక పాఠశాలల విద్యార్థులకు నోట్స్ బుక్కు పెన్నులు అందజేయడం జరుగుతుందన్నారు. ట్రస్ట్ సభ్యులు పరకాల రమేష్, పరకాల రామారావు ఉచిత హెూమియో హాస్పిటల్ డాక్టర్స్ పావనిమాణిక్యం, కె. జనార్దన్‌రావు, డాక్టర్ పోడూరి కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఎంపీడీవోగా మల్లేశ్వరి

విశాలాంధ్ర - ముదినేపల్లి : ఇటీవల ఎన్నికల నిర్వహణలో భాగంగా బదిలీపై వెళ్లిన ముదినేపల్లి ఎంపీడీవో పి. మల్లేశ్వరి మరల కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. మండలంలోని వడాలి గ్రామపంచాయతీ కార్యదర్శిగా కె. సంగమయ్య, శ్రీహరిపురం వై.వెంకటఅప్పారావు, వణుదుర్రు ఎం. శ్రీకాంత్, పెదగొన్నూరు ఎం.రాధ, వాడవల్లి కె. రుక్మిణి, చేవూరు టీజీ కృష్ణారెడ్డి, కోడూరు డి. మైనిజ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

రాష్ట్రాభివృద్ధికి అందరూ సహకరించాలి

మంత్రి కొలుసు పార్థసారథి

విశాలాంధ్ర - ముదినేపల్లి : క్లిష్టపరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు అందరూ సహకరించాలని రాష్ట్ర గృహనిర్మాణ , సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ముదినేపల్లిలో ఏర్పాటు చేసిన ఎన్డీఏ కూటమి కార్యాలయాన్ని మంత్రి పార్థసారథితో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ , ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం మండల టిడిపి అధ్యక్షులు చల్లగుళ్ళ శోభనాద్రిచౌదరి, బొర్రా చలమయ్య అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపి పుట్టా మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన రహదారులు, వివిధ సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పనకు కేంద్రం రూ.1200 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజక వర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకోవాలని కూటమి గానే ఉండాలని, తారతమ్యాలు, ఎలాంటి విభేదాలు లేకుండా సమస్యలు స్థానికంగానే పరిష్కరించుకోవా లన్నారు.

అమరావతి రాజధాని బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవిని అంబేద్కర్ మెమొంటోను బహుకరించి మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీలు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు , ఎన్డిఏ నాయకులు కోడూరు శేషబాబు, బండ్రెడ్డి రామకృష్ణ, కోటప్రోలు కృష్ణ, ఈడుపుగంటి శ్రీనివాస్, చల్లగుళ్ళ ఆదిత్యచౌదరి, పరసా విశ్వేశ్వరరావు, ఏఎన్ బాబు, దావు నాగరాజు , బికేయం నాని, వేల్పూరి నానాజీ , రౌతు రాధిక , దారం సుధ, సత్యవోలు నాగలక్ష్మి, ఎన్డీఏ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బత్తుల వెంకటేశ్వరరావు మృతి సీపీఐకి తీరని లోటు

విశాలాంధ్ర-కుక్కునూరు: వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు మృతి సీపీఐకి, వ్యవసాయ కార్మిక సంఘానికి తీరని లోటని సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి పేర్కొన్నారు. బుధవారం కుక్కు నూరు మండల సీపీఐ కార్యాలయంలో బత్తుల వెంకటేశ్వరరావు సంతాప సభ కోనే లక్ష్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ వెంకటేశ్వర రావు మరణం నూజివీడు నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీకి, వ్యవసాయ కార్మిక సంఘానికి ఎంతో నష్టమని ఆ నష్టాన్ని భర్తీ చేయటం చాలా కష్టంతో కూడుకున్నదని ఆయన తెలిపారు. వెంకటేశ్వరరావు మరణానికి సిపిఐ కుక్కునూరు మండలం సమితి, వ్యవసాయ కార్మిక సంఘం మండల సమితి, ఏఐటియుసి, తీవ్ర సంతాపాన్ని తెలిపాయి. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు సిపిఐ నాయకులు వెంకటాచారి, ఐతా సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కూరాకుల బాబురావు, ఏఐటియుసి మండల నాయకులు కొనే లక్ష్మయ్య, తదితరులు ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-భీమవరం: 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భీమవరం పట్టణంలోని కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం ఉదయం గం.9లకు నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుచే జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం ఉదయం గం.8.45 లకు ఆహ్వానితులందరూ హాజరవుతారన్నారు. అనంతరం జిల్లా ఎస్.పి. రావడం, పెరేడ్ బృందంచే 'జనరల్ సెల్యూట్' సమర్పణ ఉంటుందన్నారు. గం.8.50లకు కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ విచ్చేయుట, పెరేడ్ బృందంచే 'జనరల్ సెల్యూట్' సమర్పణ నిర్వహిస్తారన్నారు. ఉదయం గం.8.58లకు మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు విచ్చేస్తారన్నారు. ఉదయం గం.09లకు మంత్రి జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారని తెలిపారు.

అనంతరం మంత్రికి పరేడ్ కమాండర్ చే 'రాష్ట్రీయ సెల్యూట్' సమర్పణ చేయనున్నా రన్నారు. గం. 09:05లకు మంత్రిచే పరేడ్ సందర్శన గం.9:10లకు పరేడ్ బృందంచే 'మార్చ్ ఫాస్ట్', గం.9:15లకు మంత్రి ప్రసంగము,గం. 9:50లకు వేదిక ముందు నుంచి పరేడ్ బృందం నిష్క్రమణ, వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, గం.10లకు సాంస్కృతిక కార్యక్రమం నిర్వహణ, గం. 10:30లకు విశిష్ట సేవలకు ప్రశంసా పత్రాల ప్రదానం, గం.11:30లకు స్టాల్స్ ను సందర్శించుట, మధ్యాహ్నం గం. 12లకు కార్యక్రమం ముగింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని, ప్రతి ఒక్కరు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో సమన్వయంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ముందుకు తీసుకువెళ్లేందుకు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇరిగేషన్, జాతీయ రహదారులు, రెవిన్యూ అధికారులతో చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి(గ్రీన్ ఫీల్డ్) - 365 నిర్మాణంలో చింతలపూడి మండలం వెంకటాపురం గ్రామ పరిధిలో చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ ప్రతిపాదన నిమిత్తం బ్రిడ్జి నిర్మాణ విషయంలో సమస్యపై ఎన్ హెచ్ ఖమ్మం, ఇరిగేషన్ ఎస్ఇ విస్సన్నపేట తదితర అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. బ్రిడ్జి నిర్మాణ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, నూజివీడు ఆర్డీవో వై.భవానీ శంకరి, ఇరిగేషన్ ఎస్ఈ కె. శ్రీరామ కృష్ణయ్య, ఎన్.హెచ్. అధికారి దివ్యవాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం. ముక్కంటి, తదితరులు హాజరయ్యారు.

ఆభరణాల చోరీపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి.నరసాపురం: బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కె. జగ్గవరం గ్రామానికి చెందిన తెలే కృష్ణ ఈనెల 13న ఇంటికి తాళం వేసి ఉదయం 8గంటలకు భార్యతో కలిసి కూలిపనికి వెళ్ళారు. తిరిగి మధ్యాహ్నం 12.30 నిమిషాలకు ఇంటికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఇంటితాళం కోసి ఉందని దీంతో ఇంటిలోపలికి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి బీరువాలో దాచిన రెండు బంగారపు ఉంగరాలు, బుట్టాజోడు, రూ. 30 వేల నగదు మొత్తం రూ. 52వేల5వందల విలువ గల బంగారపు వస్తువులు గుర్తు తెలియని దొంగలు అపహరించారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లాపురం పాఠశాలకు కంచాల బహూకరణ

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం తల్లాపురం గ్రామంలోని ఎంపీ యూపీ పాఠశాలకు ఓ దాత 70 స్టీల్ కంచాలు బుధవారం బహుకరించారు. బసవ నాగేశ్వర రావు వారి తల్లి దండ్రులు సత్యనారాయణ, మంగాయమ్మ జ్ఞాపకార్థం స్టీల్ కంచాలు బహూకరించారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా దాతను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించాలి

విశాలాంధ్ర-ముదినేపల్లి : 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతి పౌరుడు ఘనంగా నిర్వహించుకోవాలని ఎంపీడీవో పి. మల్లేశ్వరి అన్నారు. మండల పరిషత్ ప్రాంగణం నుండి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బందితో కలసి తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్యం కొరకు ప్రాణత్యాగం చేసి పోరాడిన యోధులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ పిఆర్డి డి.లక్ష్మీనారాయణ, సూపరింటెండెంట్ ఎం. నాగేశ్వరరావు, సుబ్బారావు, వెలుగు, ఉపాధిహామీ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బోధనా విధానంపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

విశాలాంధ్ర - గోకవరం : జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మండలంలోని గోకవరం తంటికొండ గ్రామాలలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వ

గోకవరం, తంటికొండ గ్రామాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

హించి ప్రభుత్వ పాఠశాలలో సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేశారు. తొలుత గోకవరం జడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మౌలిక సదుపాయాలు , పనుల పురోగతి, తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయులు బోధనా విధానం పై వివరాలు తెలుసుకుని సమగ్ర నివేదిక అందజేయవలసిందిగా ఆదేశించారు. తదుపరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై వివరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల నుంచి ఆసుపత్రుల్లో వైద్య సేవలు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకం అందజేసేందుకు వంట శాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ తెలియజేశారు. పాఠశాల ఆవరణలోనూ పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పాఠశాలకు ఒక ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో తనిఖీలు చేపట్టి ఎప్పటికప్పుడు సూచనలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు

జేసీగా చినరాముడు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా చిన రాముడు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి బొకేను అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి చిన రాముడుతో జిల్లాలోని ప్రాధాన్యత అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, కలెక్టర్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు చిన రాముడును కలిసి అభినందనలు తెలియజేశారు.

మహనీయులు త్యాగాలే నేటి స్వాతంత్ర్య ఫలాలు

ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ

విశాలాంధ్ర - రాజానగరం : మహనీయులు ప్రాణ త్యాగ ఫలాలే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య ఫలాలని నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన రాజానగరంలో సుమారు 2వేల మంది విద్యార్థులతో 300 అడుగుల భారీ జాతీయ జెండాతో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఎంపిడివో కార్యాలయం ప్రాంగణంలోని బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనుభావులు త్యాగ ఫలాలతో సాధించిన దేశ స్వాతంత్ర్య ఫలాలను భావి తరాలకు అందించే క్రమంలో గొప్ప చరిత్ర గల మన దేశ సమగ్రత కాపాడడం మనందరి కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కార్యకర్తలు, ప్రజలు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.

యువత చదువు పై శ్రద్ధ పెట్టాలి

విశాలాంధ్ర - తాళ్లపూడి : యువత ఒక్క చదువుపైనే శ్రద్ధ పెట్టాలని, సమాజం లో ప్రజల్ని పెడద్రోవ పట్టిస్తున్న మత్తు పదార్ధాలకు ముఖ్యంగా యువత దూరంగా ఉండాలని ఐసిడిఎస్ సీడీపీవో మమ్మి పేర్కొన్నారు. పిల్లలు మంచి విద్య, చదువు కుం టారని నమ్మకంతో పంపిన తల్లి తండ్రులు నమ్మకాన్ని వొమ్ము చేయద్దని కోరారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండ లంలోని వేగేశ్వరపురం జూనియర్ కళాశా లలో మాదక ద్రవ్యాలు నిషేధం పై అవగా హన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఎంఈఓ బాలామణి, కాలేజి ప్రిన్సిపాల్ గరగ శ్రీనివాస్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జాతీయ జెండాలు పంపిణీ

విశాలాంధ్ర - అనపర్తి : ఆజాదికాఅమృత్ మహోత్సవం లో భాగంగా స్థానిక మార్కెట్ రోడ్‌లో ప్రతి షాప్‌కి వెళ్లి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జాతీయ జెండాను వ్యాపారస్తులకు అందచేశారు. బుధవారం హర్ ఘర్ తిరంగా అవగాహన కార్యక్రమం పురస్కరించుకుని ముందుగా మహాత్మా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే నల్లమిల్లి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరణ, ప్రాధాన్యతను ఎమ్మెల్యే నల్లమిల్లి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), తాడి గంగిరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి వెంకటరామారెడ్డి,ఓగిరెడ్డి రాధ, ప్రసాద్ రెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, బాబురావు, వెంకన్న బాబు, కర్రి సూర్య నారాయణ రెడ్డి (సూరి), కూటమి నేతలు పాల్గొన్నారు.

సమాజసేవకులు రోటరీ గోల్డ్ సభ్యులు

విశాలాంధ్ర - కాకినాడ : నిరంతరం సమాజానికి సకాలంలో సేవలందిస్తూ రోటరీ ఆశయాలకు అంకితమవుతున్నారని రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షులు ఎస్ శ్రీకాంత్ అన్నారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ జి శ్యామ్ జన్మదినోత్సవ సందర్భంగా క్లబ్ పూర్వాధ్యక్షులు ధనసాగర్ ప్రసాద్ తోకలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ శ్యామ్ చేస్తున్న సేవ సమాజాభివృద్ధితో పాటు వేలాది మందికి జీవనోపాధి కల్పన, సమాజానికి మార్గదర్శకులను అందిస్తున్నారని కొనియాడారు. ఉద్యోగ ఉపాధి కల్పనలో ఎన్నోసంవత్సరాలుగా కృషి చేస్తున్నారని అభినందించారు. క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాల విజయవంతానికి సహకరించాల్సిందిగా కోరారు. క్లబ్ చేసే సేవా కార్యక్రమాలకు సహకరిస్తానని చెప్పారు.

భారతీయులకు ఘనమైన పండుగ స్వాతంత్ర్య దినోత్సవం

విశాలాంధ్ర - కొవ్వూరు : భారతదేశ స్వాతంత్ర దినోత్సవం భారతీయులకు ఘనమైన పండుగ అని, వాడ వాడల జెండా పండుగను ఘనంగా జరుపుకోవాలని కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బుధవారం కొవ్వూరు పట్టణంలోని నరక వీధి వాటర్ ట్యాంక్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు జాతీయ జెండాను ఎగురవేస్తూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటిష్ వారి ఉక్కి పిడికిలిలో బలైపోతున్న భారతీయులకు స్వేచ్ఛ స్వాతంత్రం కావాలనే నినాదంతో స్వాతంత్ర ఉద్యమ వీరుల త్యాగాల ఫలితం నేడు మనం అనుభవిస్తున్న భారత దేశ స్వేచ్ఛ స్వాతంత్రయమని అన్నారు. భావితరాలకు స్వాతంత్ర అమరవీరుల స్ఫూర్తిని తెలియజేస్తే విధంగా జెండా పండుగను ఘనంగా జరుపుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో కొవ్వూరు డివిజన్ సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ కొవ్వూరు మున్సిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి కొవ్వూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమని రామకృష్ణ, కొవ్వూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్ కుమార్ మద్దిపట్ల శివరామకృష్ణ పెనుమాక జయరాజు అర్జున్ని రామ కృష్ణ జనసేన కొవ్వూరు పట్టణ అధ్యక్షులు దేగల రాము, గంగుమల్ల స్వామి జనసేన కొవ్వూరు పట్టణ మహిళా అధ్యక్షురాలు కడతారి నవ్య, మండల పరిషత్ అధికారి కె సుశీల కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసెఫ్ తదితర తెలుగు దేశం జనసేన భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు మున్సిపల్ సిబ్బంది ప్రభుత్వ బాలుర హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు మున్సిపల్ హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఎస్ఐగా రఘునాథరావు

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా టి రఘునాథరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్ఐగా పని చేసిన నాగార్జున రాజు విఆర్‌కు బదిలీ కావడంతో అల్లూరి సీతారామ రాజు జిల్లా జడ్డంగి పోలీసు స్టేషన్ నుండి రఘునందనరావు జగ్గంపేటకు వచ్చారు. అయన స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను, టిడిపి కాకినాడ జిల్లా జ్యోతుల నవీన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పోలీసు స్టేషన్ సిబ్బంది, పలువురు అయనకు స్వాగతం పలికారు.

సుఖీభవ ట్రస్ట్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - కాకినాడ, రామచంద్రపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పాత బస్టాండ్ వద్ద సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్ ఐదవ వార్షికోత్సవ వేడుకలను ట్రస్ట్ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకన్న అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్మిక, కర్మాగార, బాయిలర్స్ వైద్య బీమా సేవ శాఖల మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం,మాజీ మంత్రివర్యులు చిక్కాల రామచంద్రరావు, టిడిపి రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్య నిర్వాహక కార్యదర్శి పాయకరావుపేట నియోజక వర్గం పరిశీలకులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, చైతన్య సంస్థల అధినేత చింత వెంకటరెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ సుఖీభవ ట్రస్ట్ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఐదు సంవత్సరాలుగా ప్రతి నెల నాలుగో మంగళవారం నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరం ద్వారా ఎంతో మంది పేద ప్రజలు వైద్య సహాయం పొందుతున్నారని, ఈ ట్రస్ట్ ద్వారా ప్రతిరోజు పేదలకు కడుపు నింపాలనే ఉద్దేశంతో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ట్రస్ట్ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకన్నకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ ట్రస్టు స్థాపించినప్పటి నుండి ఇప్పటివరకు ట్రస్ట్ చేపట్టే ప్రతి కార్యక్రమంలో తన వంతు సాయం చేస్తున్నానని, ఇంకా ముందు ముందు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ట్రస్టును ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. పేద వాడి ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లను ఆగస్టు 16వ తేదీన పునః ప్రారంభిస్తున్నారని అన్నారు. అలాగే ట్రస్టు సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయవలసిందిగా మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యంని కోరగా, దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

మాజీ సీఎం నల్లారిని కలిసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అనపర్తి, పెదపూడి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం రాజమహేంద్రవరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి మాజీ అధ్యక్షులు సోము వీర్రాజు, కంటిపూడి సర్వారాయుడు ఉన్నారు.

సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలిగా రమణకుమారి

విశాలాంధ్ర - మామిడి కుదురు : మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలిగా నగరం గ్రామ సర్పంచ్ జాలెం రమణ కుమారి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఈ మేరకు మామిడి కుదురు మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన సర్పంచుల సమావేశంలో ఆమెను సర్పంచులు అందరూ సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నుకున్న వారందరికీ రుణపడి ఉంటానన్నారు. సహచర సర్పంచ్లు అందరికీ అందు బాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. నూతనంగా ఎన్నికైన ఆమెను ఎంపీపీ కుసుమ వనజ కుమారి, ఎంపీడీవో వేణుగోపాల రెడ్డి, పరిపాలన అధికారి కె వెంకటేశ్వర రావు, ఈవోపీఆర్డి శ్రీనివాసరావు అభినందించారు. నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, టీడీపీ సీనియర్ నాయకులు జాలెం సుబ్బారావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గుబ్బల దుర్గ, కడి అరుణ కుమారి, కోనుకు ప్రేమజ్యోతి, చుట్టుగుళ్ల లక్ష్మి, అల్లు విజయలక్ష్మి, వలవల సత్యవేణి, గెడ్డం మంగాలక్ష్మి, గుబ్బల గీతా భవాని, చెల్లుబొయిన రామ శివ సుబ్రమణ్యం, తెలగారెడ్డి సూర్య ప్రకాశ రావు, బళ్ల శ్రీనివాస రావు, గౌస్ మొహిద్దీన్, సుందరనీడి చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భారీ త్రివర్ణ పతాక ర్యాలీ

విశాలాంధ్ర - సామర్లకోట : స్థానిక మున్సిపల్ హైస్కూల్ సామర్లకోటలో ప్రధానోపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో 300 అడుగుల భారీ జాతీయ పతాకంతో ఏర్పాటు చేసిన ర్యాలీని స్థానిక వార్డు కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు బుధవారం ఉదయంజెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థుల్లో దేశభక్తి భావాలు పెంపొందించడానికి ఈ కార్యక్రమాలు దోహదపడతాయని వాసు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు సాయిరాం కృష్ణ మాట్లాడుతూ హర్ గర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్, పట్టణ తెలుగుదేశం అధ్యక్షులు అడబాల కుమారస్వామి, గాంధీ, కమిటీ సభ్యులు సతీష్, బిఎన్‌వి రత్న కుమారి, ఉపాధ్యాయులు జి గోవిందు, కెవివి సత్యనారాయణ, అరుణ, ఏఎల్ వి కుమారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో హర్‌గర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్తు కార్యాలయం నుండి దేవరపల్లి మెయిన్ రోడ్డు బస్టాండ్ మీదుగా గోపాలపురం సెంటర్ వరకు కొన సాగింది. ఎంపీడీవో ప్రభాకర్ రావు వైస్ ఎంపీపీ సాది సుబ్బారావు మండల విద్యాశాఖ అధికారులు తిరుమల దాసు కె ఆర్ ఎస్ వి వి అప్పారావు హెచ్‌ఎం శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో హై స్కూలు భాష్యం స్కూలు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రామచంద్రరావు శ్రీనివాస్, షరీఫ్, ఆర్‌ఐ వెంకటేశ్వరరావు, డాక్టర్ సాంబశివరావు, కమలావతి, శివ, హరిబాబు, సిహెచ్ జగజీవన్ రావ్, సూపరిండెంట్ శాంతి, విద్యాసాగర్ పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్యే సత్యప్రభ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : రాష్ట్రం విద్య శాఖలో ఒక భాగం అయినా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఆర్పీల రాష్ట్ర ప్రెసిడెంట్ రాంజీ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల సీఆర్పీలు, సమగ్ర శిక్ష క్రాఫ్ ఉపాధ్యాయులు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తానని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఇటీవల సీఆర్పీల రాష్ట్ర అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన రాంజీ ప్రసాద్‌ను, ఎంఈఓలు రాజ బాబు, అచ్చిరాజు, ప్రత్తిపాడు నియోజకవర్గ లోనీ సిఆర్పిలు గంగరావు, భాషా, మల్లేష్, సమగ్రా శిక్ష ఉపాధ్యాయులు రాంజీను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం శాంతి ఆశ్రమం, పెద్దిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అడిషనల్ డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ పి సరిత బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. డెంగ్యూ మలేరియా, టైఫాయిడ్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామపంచాయతీ అధికారులతో చర్చించి గ్రామాలలో క్లోరినేషన్, పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. క్రమం తప్పకుండా ఫీవర్ సర్వేలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఫార్మసీ, ల్యాబ్ సెక్షన్లో ఉన్న రికార్డులును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో శాంతి ఆశ్రమం పిహెచ్సి వైద్య అధికారులు కే మురళీ మోహన్ రెడ్డి, జి శివకృష్ణ, పెద్దిపాలెం పిహెచ్సి వైద్య అధికారులు రత్నబాబు, యశస్వి, ఎంపీహెచ్వో నాగవాసు, ఆర్ రాంబాబు, వీర్రాజు, పిఎస్ రామకృష్ణ, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్ హెచ్పిలు తదితర వైద్య సిబ్బంది హాజరయ్యారు.

రోడ్ల సమస్య పరిష్కారానికి కృషిచేస్తా

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : మండలంలోని సోమరాయణంపేట జగనన్న కాలనీ రోడ్లను జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ బుధవారం పరిశీలించారు. కాలనీలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయని అక్కడి ప్రజలు రమేష్‌కు విన్నవించడంతో ఆ ప్రాంతాఎన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్లను అస్సలు పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వంలో అన్ని రోడ్లు వేయించడం జరుగుతుందన్నారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాపేటి చిట్టిబాబు, మాదారపు చిట్టిబాబు, గోకెడ ప్రసాద్, కాయల మణికంఠ, పాలెం బాబి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని పెద్దాపురం వ్యవసాయ శాఖ ఏడిఏ ఎన్ దైవకుమార్ అన్నారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో బుధవారం ఏఓ సంజయ్కుమార్ అధ్యక్షతన పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ దైవకుమార్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి సేద్యంలో నీమాస్త్రాన్ని స్వయంగా తయారు చేసుకోవచ్చన్నారు. ఈ నీమాస్త్రం మూడు నెలల వరకు నిల్వ ఉంటుందని, తయారైన ఎరువును పంటపై చల్లుకోవాలన్నారు. ఏఓ సంజయ్ కుమార్ మాట్లాడుతూ నీమాస్త్రం ఎరువు అన్ని రకాల పురుగు గుడ్లను చంపి, పంట తెగుళ్ల నివారణకు పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రసాద్, వీఏఏలు విజయదుర్గ, అమృత, రైతులు రామకృష్ణ. సుబ్బారావు, గోవిందు పాల్గొన్నారు.

గొల్లప్రోలు నూతన ఎస్ఐగా రామకృష్ణ

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఎన్ రామకృష్ణ బుధ వారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఎస్ఐగా విధులు నిర్వహి స్తున్న జాన్ భాషాను వీఆర్‌కు పంపిం చారు. గొల్లప్రోలు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యతో పాటు, ఈవ్ టీజింగ్, రోడ్ యాక్సిడెంట్ల నివారణకు దృష్టి సారిస్తానని తెలియచేశారు.

సామర్లకోట పురపాలక సంఘం

ఇంజనీరింగ్ విభాగము

ఆర్.ఓ.సి.నెం.418/2024-ఇ1, తేది : 14-08-2024

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

సామర్లకోట పురపాలక సంఘం జనరల్ నిధులతో **ఇ.సి.వి రూ.13.98 లక్షలతో 6 పనులను** చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిని ఆన్‌లైన్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

1	షెడ్యూల్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది	1) ది.14-08-2024 మధ్యాహ్నం గం.3.00ల నుండి (5 పనులకు) 2) ది.16-08-2024 మధ్యాహ్నం గం.3.00ల నుండి (1 పనికి)
2	టెండర్లు స్వీకరణకు ముగింపు తేది	1) ది. 29-08-2024 ఉదయం గం.10.30ల వరకు (5 పనులకు) 2) ది.22-08-2024 ఉదయం గం.10.30ల వరకు (1 పనికి)

తదుపరి వివరాల కొరకు www.eprocurment.gov.in నందు 'e' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ వెబ్‌సైట్ నందు పొందవచ్చును.

కమిషనరు, సామర్లకోట పురపాలక సంఘం

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విశాలాంధ్ర - పెరవలి : మండలంలోని ముక్కామల గ్రామంలో అంగ న్వాడీ సెంటర్ జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు ప్రభుత్వ వైద్య సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో బుధవారం, వైద్య పరీక్షలు నిర్వహించారు. పౌష్టిక ఆహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. 350మంది విద్యా ర్థులకు హెచ్.బీ టెస్టు నిర్వహించి,10 మంది విద్యార్థులకు ఎనిమిక్ ఉన్నట్టుగా వైద్య సిబ్బంది గుర్తించారు. ఈవిద్యార్థినులకు ఐరన్ మాత్రలు అందజేశారు. ఈకార్యక్రమంలో పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి విజయకుమార్ సచివాలయ ఏఎన్‌ఎంలు శాంతి, ఎమ్ ఎల్ హెచ్ పి కె ఏంజిలెన ఆనంద్ హెల్త్ అసిస్టెంట్ సిహెచ్ వెంకటపతి పాల్గొన్నారు.

మూడోరోజు పంచాయతీ సర్పంచ్‌లకు,కార్యదర్శులకు శిక్షణ

విశాలాంధ్ర - రావులపాలెం : పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు 3 రోజుల రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమాన్ని ముగించారు. చివరి రోజు శిక్షణలో ఇప్పటివరకు జరిగిన శిక్షణపై గౌరవ సర్పంచ్‌లకు వ్రాత పరీక్ష నిర్వహించి, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎస్‌టివి రాజేశ్వరరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ శ్రీనివాస్ విజేతలకు ధృవపత్రాలు అందజేశారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన **1. ద్వారంపూడి గోపాలకృష్టారెడ్డి** S/O **సూర్యనారాయణ రెడ్డి, 2. ద్వారంపూడి శాంతకుమారి** W/O **గోపాలకృష్ణారెడ్డి** అనే పేరుతో గల ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ **8731/2022** జిరాక్స్ కొరకు అనపర్తి తీసుకుని వెళుతుండగా దారి మధ్యలో పడిపోయింది. కావున దస్తావేజు ఎవరికైనా దొరికినచో దయచేసి అందజేయగలరు.

అడ్రస్: ద్వారంపూడి గోపాలకృష్ణారెడ్డి
S/O సూర్యనారాయణ రెడ్డి (లేటు),
సరిపల్లి పేట, డోర్ నెంబరు:11-21 ఎ,
పందలపాక, బిక్కవోలు మండలం.
ఫోన్ నెం: 92481 24554, 94912 14995

శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానం,
అన్నవరం - కాకినాడ జిల్లా

ఆరెంపూడి సత్రం సి4/491458/1/2024, తేది : 12-08-2024

బహిరంగవేలం ప్రకటన

శ్రీ స్వామి వారి దేవస్థానం, అన్నవరం దత్తత సత్రమైన ఆరెంపూడి సత్రం స్వాధీన హక్కు భుక్తములో గల ప్రత్తిపాడు మండలం, చిన ఏలూరు గ్రామ పంచాయతి పరిధిలో గల సర్వే నెం. **96,101** నందలి ఎ.**5.54** సెం.లు భూమి 15ప ప్రతి/ బిట్టుకు కౌలు హక్కునకు **తేది : 22-08-2024 ఉదయం 11.00**లకు గ్రామ పంచాయతీ కార్యాలయము కార్యనిర్వహణాధికారి వారి అనుమతి పొందిన అధికారిచే బహిరంగ వేలం నిర్వహించబడును.

ఉప కమీషనరు & కార్యనిర్వహణాధికారి

వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

విశాలాంధ్ర - పిఠాపురం : స్వాతంత్ర దినోత్సవ ఉత్సవాలు పురస్కరించుకుని విశాఖపట్నంకు చెందిన జిపిటి ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ వారు చేపట్టిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే వర్మ పాల్గొన్నారు. ఈ ర్యాలీ స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి ఉప్పాడ సెంటర్ వరకూ 100 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించి దేశభక్తిని చాటిచెప్పారు. అయితే ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వలన ప్రతి ఒక్కరితో దేశభక్తీ పెరుగుతుందన్నారు. స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది ప్రాణాలు త్యాగం చేసారని, వారిని ఒకసారి స్మరించుకుంటూ, దేశంపై అభిమానం, ఈ కార్యక్రమం మన దేశం యొక్క శాశ్వతమైన స్ఫూర్తికి మరియు మనం గౌరవించే విలువలకు గొప్ప నివాళి అన్నారు. ముఖ్యంగా మన జాతీయ జెండా ప్రదర్శన అందరినీ కదిలించిందని, ఇది మన భాగస్వామ్య వారసత్వానికి శక్తివంతమైన చిహ్నం మాత్రమే కాకుండా మనల్ని ఒక దేశంగా నిర్వచించే గర్వం, ఐక్యతకు నిదర్శనం అన్నారు. ఈ ర్యాలీ అంతటా జెండా ప్రాముఖ్యత మన స్వేచ్ఛ కోసం చేసిన త్యాగాలను మరియు స్వాతంత్ర్యం మరియు ప్రజాస్వామ్యం సూత్రాలను పరిరక్షించడంలో కొనసాగుతున్న నిబద్ధతకు పదునైన గుర్తుగా పనిచేసిందని అన్నారు. ఈ వేడుక విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నానని, చక్కగా నిర్వహించబడిన, అర్థవంతమైన సంఘటనల ద్వారా మన సామూహిక అహంకారం , ఐక్యతను బలోపేతం చేస్తాయని, మన దేశ స్వాతంత్ర్యాన్ని గౌరవించడంలో మీ ఆదర్శప్రాయమైన కృషికి మరోసారి ధన్యవాదాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సత్యప్రభ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : వరుపుల రాజా 49వ జయంతి సందర్భంగా ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో స్థానిక టీడీపీ నాయకులు బొదిరెడ్డి గోపాలకృష్ణ ఇంటివద్ద కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా ప్రత్తి పాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా పాల్గొని కేక్ కట్ చేసి, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రోగులకు పండ్లు, రొట్టెలు పం పిణీ చేశారు. అలాగే స్థానిక భవిత స్కూల్లో మానసిక వికలాంగుల సమక్షం లో వరుపుల రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి వారితో కొద్దిసేపు ఎమ్మెల్యే సత్యప్రభ ముచ్చటించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వరుపుల తమ్మయ్య బాబు, పట్టణ కౌన్సిలర్లు బొద్దిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణ స్వామి, ఎండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఏలేశ్వరం మండల చీణూ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అసలైన దేశభక్తిని చాటిన ఆదిత్య విద్యార్థులు

విశాలాంధ్ర - కాకినాడ : ఆదిత్య విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవ శుభవేళ తమ దేశ భక్తిని చాటడంతో పాటు 3880 చెట్లకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించారు. 1,93,426 కేజీల పునరుత్పాదక శక్తిగల పనికిరాని చెత్తను ఐటిసి సంస్థ వారికి అందించి కాగితాల తయారీకోసం ఉపయోగించే 3880 చెట్లను నరకకుండా వాటికి స్వేచ్ఛను ప్రసాదించారు. దీంతో ఆదిత్య విద్యార్థులు పర్యావరణ హితులని మరొకసారి నిరూపించుకున్నారు.

వాతావరణం కలుషితం కాకుండా ప్రకృతి వనరులను రక్షిస్తూ ముందుకు సాగాలనే ఉద్దేశ్యంతో ఐటిసి. సంస్థ WOW(Well being out of Waste) అనే సామాజిక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. వ్యర్థంగా పడవేసే కాగితాలను కాగితం పరిశ్రమలో ముడిసరుకుగా ఉపయోగిస్తూ సహజ వనరులను సంరక్షించుకుంటూ పర్యావరణ పరిరక్షణకు దోహదపడడం ఈ ప్రాజెక్టు ఉద్దేశ్యం. ఈ ప్రాజెక్టులో ఆదిత్య పాఠశాలలు తమ విద్యార్థులను భాగస్వాములను చేయడం జరిగింది. గత వారం రోజులుగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఆదిత్య పాఠశాలల విద్యార్థులు అత్యధికంగా పాల్గొని 1,93,426 కేజీల (సుమారు 194 టన్నులు) పునరుత్పాదక శక్తిగల పనికిరాని చెత్తను ఐటిసి సంస్థ వారికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఐటిసి సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ తాము చేపట్టిన ఈ సామాజిక కార్యక్రమానికి ఆదిత్య విద్యార్థులు ముందుకు వచ్చి ఈ విధంగా తమ దేశభక్తిని చాటడం చాలా ఆనందాన్నిచ్చిందని అన్నారు. ఆదిత్య పాఠశాలల డైరెక్టర్ ఎన్ శృతి రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ హితాన్ని కోరే ఏ కార్యక్రమానికైనా ఆదిత్య ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. అనంతరం ఆదిత్య విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ ఎన్ శేషారెడ్డి మాట్లాడుతూ ఇంత చక్కని కార్యక్రమానికి విద్యార్థులను ప్రోత్సహించిన ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ (వెస్ట్ గోదావరి) ఎస్‌వి రాఘవరెడ్డిని, ఆదిత్య పాఠశాలల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ విద్యార్థిని వారి తల్లిదండ్రులను ఈ సందర్భంగా అభినందించారు.

కెనరా సేవలు హర్షణీయం

విశాలాంధ్ర - రాజానగరం : విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిన ప్రతిభను వెలికితీసేందుకు కెనరా బ్యాంకు అందించిన సేవలు హర్షణీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటి బాబు అన్నారు. మండలంలోని దివాన్ చెరువు గ్రామంలోని కెనరా బ్యాంకు మేనేజర్ దేవిరెడ్డి ఢిల్లీ రావు ఆధ్వర్యంలో పాలచర్ల గ్రామంలోని హై స్కూల్‌కి చెందిన విద్యార్థినులకు స్కాలర్ షిప్స్ నగదును బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇటువంటి స్కాలర్‌షిప్ ప్రోత్సాహకాలు దోహదపడతాయన్నారు. కెనరా బ్యాంకు మేనేజర్ దేవిరెడ్డి ఢిల్లీ రావు మాట్లాడుతూ భారత దేశ స్వతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని విద్యా రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 5,6,7 తరగతికి చెందిన విద్యార్థినులకు రూ.3వేల నగదు 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులకు రూ.5వేల నగదు చొప్పున మొత్తం రూ.24 వేల నగదు ప్రోత్సాహకాలు అందించామన్నారు. ప్రస్తుత ఏడాదికి తరగతికి ఒక్కొక్కరికి చొప్పున మొత్తం ఆరుగురికి తమ బ్యాంకు స్కాలర్ అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎన్టీయుసి జిల్లా అధికార ప్రతి నిధి శ్రీనివాస్,నాయకులు సత్యనందం, కెనరా బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ సురేష్ ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర - తాళ్లపూడి: రాజమండ్రి ఎంపీ పురంధరేశ్వరి తాళ్లపూడి మండలంలోని పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసారు. మండలంలోని వేగేశ్వరపురంలో హైస్కూల్‌ను సందర్శించి, తాడిపూడి ,రాగోలపల్లి, అన్నదేవరపేట గ్రామాల మీదుగా గోపాలపురం వెళ్లారు. బుధవారం జరిగిన ఈ పర్యటనలో వేగేశ్వరపురం, అన్నదేవరపేట గ్రామాల్లో హర్ ఘర్ తరంగ్ కార్యక్రమాల్లో కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావుతో పాటు పాల్గొన్నారు. రాగోలపల్లి, అన్నదేవరపేట, తిరుగుడుమెట్ట వద్ద గల కల్వర్ట్‌లను పరిశీలించారు. పలుప్రాంతాల్లో వరుస వర్షాలకు, కొవ్వాడ నీటి తాకిడికి గురైన పంటలను సందర్శించారు. వేగేశ్వరపురంలో బిజెపి నాయకులు, తాడిపూడిలో జనసేన నాయకులు, అన్నదేవరపేట లో యువ నాయకులు ఆధ్వర్యంలో ఎంపీ పురంధేశ్వరి దేవికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే, జనసేన నాయకులు టి.వి.రామారావు, తాళ్లపూడి మండలంలోని నాయకులు కైగాల శ్రీనివాస్, అల్లూరి విక్రమాదిత్య, కాకర్ల సత్యేంద్ర, ఇందుగుల రామకృష్ణ, గంటా కృష్ణ, సబ్ కలెక్టర్ అసితోష్ శ్రీ వాత్సవ్, తాళ్లపూడి తహసీల్దార్ బి.రవీంద్రనాద్, ఎం.ఈ.ఓ బాల మణి, మండల ఈఓపిఆర్డీ వీరన్న, రాష్ట్ర కార్యదర్శి పరిమి రాధా, జిల్లా అధ్యక్షులుదత్తు, ముత్యాలరావు, ఆంజనేయులు, కిసాన్ మోర్చా నాయకులు నాగేంద్ర, రాష్ట్ర మహిళ మోర్చా నాయకురాలు పాల్గొన్నారు.

దేశ ఔన్నత్యాన్ని కాపాడుతాం

దేశభక్తిని చాటుకున్న అంగర సిద్ధార్థ కళాశాల విద్యార్థులు

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగరలోని శ్రీ సిద్ధార్థ కళాశాల విద్యా ర్థులు 78వ ఆకారంలో నిలుచుని తమ దేశభక్తిని చాటుకున్నారు. కళాశాల మైదానంలో మువ్వన్నెల జెండాను చేతబట్టి దేశ కీర్తిని కొనియాడారు. దేశ ఔన్నత్యాన్ని కాపాడుతామంటూ నినదించారు. విద్యా రంగంలో రాణించడం ద్వారా దేశం మరింత పురోభివృద్ధి చెందుతుందని కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర అన్నారు. గ్రామీణ విద్యార్థులు బాధ్యతాయుతంగా నడుచుకోవడం ద్వారా భావి భారత విద్యార్థులు ఉన్నత రంగాల్లో రాణించగలరని డాక్టర్ దివ్యశేఖర్ అన్నారు. కరెస్పాండెంట్ వాకా రాజా మాట్లాడుతూ సమాజాన్ని అర్థం చేసుకునేందుకు విద్య దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం అందజేత



విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి మండలం గొల్లగూడెంలోని లగడపాటి రామలక్ష్మమ్మ రామానాయుడు వృద్ధాశ్రమం, వికలాంగుల అనాధాశ్రమానికి కొయ్యలగూడెం గ్రామానికి చెందిన బట్టు సుశాంత్ శ్రీ చంద్ర పది వేల రూపాయలు విరాళాలు అందజేశారు. సుశాంత్ చంద్రకు ఉన్నత ఉద్యోగం రావడంతో ఆయన తల్లిదండ్రులైన బట్టు శ్రీనివాస్ స్వర్ణలత దంపతులు సుశాంత్ శ్రీ చంద్ర 10 వేల రూపాయలు విరాళాన్ని ఆశ్రమ నిర్వాహకుడు కాగిత భాస్కరరావుకు అందజేశారు. పదివేల రూపాయలు వృద్ధాశ్రమానికి వికలాంగుల విద్యార్థులకు వినియోగించాలని దాతలు వృద్ధాశ్రమం నిర్వాహకుడు కాగిత భాస్కర రావుకు సూచించారు దాతలను కాగిత భాస్కరరావు అభినందించారు. కార్యక్రమం లో గోపాలపురం హై స్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్లు కాకినాడ శాంతీనగర్ కాపురస్తులు **దంతులూరి అప్పల నరశింహ ప్రసాద్ వర్మ గారి కుమారులు 1) దంతులూరి వెంకట కిషన్ రాజ్ (2) దంతులూరి వెంకట సత్య కిరణ్ రాజ్** తరపున తెలియజేయునది

మా క్లయింట్లు ఈ దిగువ షెడ్యూలునందు ఉదహరించిన ఆస్తిని (1) కాకినాడ జగన్నాథపురం గోలీలపేట కాపురస్తులు చింతకాయల (లేటు) సత్యన్నారాయణ అనే సత్యారావుగారి భార్య 1) చింతకాయల సావిత్రి, చింతకాయల (లేటు) సత్యనారాయణ అనే సత్యారావుగారి కుమారుడు 2) చింతకాయల రాంబాబు అనే రామలింగేశ్వరరావు. చింతకాయల (లేటు) సత్యన్నారాయణ అనే సత్యారావు గారి కుమార్తె 3) చింతకాయల పార్వతి, కాకినాడ జగన్నాథపురం శివారు మామిడిపల్లి వారి వీధి, కాపురస్తులు చింతకాయల (లేటు) చంద్రశేఖర్ (చింతకాయల సత్యన్నారాయణ అనే సత్యారావు గారి కుమార్తు) భార్య 4) వీరవేణి. చింతకాయల (లేటు) చంద్రశేఖర్‌గారి మైనర్ కుమారుడు 5) హర్షవర్ధన్. చింతకాయల (లేటు) చంద్రశేఖర్‌గారి మైనరు కమారుడు 6) హర్షకుమార్‌ల నుండి కొనుగోలు చేయుటకు ఏర్పాటు చేసుకొని యున్నారు.

సదరు పైన ఉదహరించిన వారు ఈ క్రింది షెడ్యూలు ఆస్తి వారి పూర్వార్జితపు ఆస్తి అని సదరు ఆస్తిని వారు చింతకాయల సత్యన్నారాయణ అనే సత్యారావుగారి అనంతరం దాఖలుపడిన ఆస్తిగా అనుభవించుచున్నారని, పైన చెప్పినవారు తప్ప చింతకాయల (లేటు) సత్యన్నారాయణ అనే సత్యారావుగార్కి ఇతర వారసులు ఎవరూ లేరని, సత్యారావుగారి అనంతరం పైన చెప్పిన వారు షెడ్యూలు ఆస్తిని సంపూర్ణ హక్కు బుక్తములతో అనుభవించుచున్నారని చెప్పుచున్నారు.

క్రింద ఉదహరించిన షెడ్యూలు ఆస్తిపై ఏ ఇతరులకైన ఎటువంటి హక్కులు, క్లయిములు కలిగిన యెడల అటువంటి హక్కులు, క్లయిములన్నీ ఈ ప్రకటన తేదీ అనంతరం **ఒక వారములోగా** తగు ఆదారాలతో ఈక్రింది వార్కి తెలిపర్చవలెను. ప్రకటన తేదీ వారము రోజుల తరువాత ఎవరు ఎటువంటి క్లయిములను చేసిన అవి మా క్లయింటును బైండు చేయవని తెలియజేయడమైనది.

షెడ్యూలు

తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ జిల్లా రిజిస్ట్రారీ వారి పరిధిలో, తాళ్ళరేవు సబ్ రిజిష్టరీ వారి ఆఫీసులో చేరిన పటవల గ్రామ పంచాయితీ ఏరియా పటవల గ్రామం తాలూకా జిరాయితీ పల్లం సర్వే నెం. 58-5 పూరా య.7.80 సెంట్లలో 5.33 సెంట్లు మరియు సర్వే నెం.58-8లో 0.45 సెంట్లు వెరసి య.5.78 సెంట్లు భూమికి **హద్దులు** : **తూర్పు:** మురుగుకాలువ, **పడమర:** పంటబోది **దక్షిణం:** డి.వి.లక్ష్మి, **ఉత్తరం :** డి.వి. క్రిష్ణంరాజు

అయ్యగారి వెంకటేష్, అడ్వకేట్,
కాకినాడ 8-10-1, కమలాదేవివీధి, గాంధీనగర్,
ది.13-08-24 కాకినాడ, సెల్: 98481 67773

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా

– వాడవాడలా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు
– కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర – భీమవరం : దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ పతాకను ఎగురవేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం వివిధ శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు, జాతీయ జెండా ప్రాముఖ్యతను ప్రజలందరికీ తెలియజేసి వారిలో చైతన్యాన్ని కలిగించేందుకు ఊరూ వాడా హర్ ఘర్ తిరంగా ర్యాలీలను నిర్వహించుటలో వివిధ శాఖల అధికారులు కీలక భూమిక పోషించాలని కలెక్టర్ ఆదేశించారు.

దేశభక్తిని చాటేలా హర్ ఘర్ తిరంగా

కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర–ఏలూరు: ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా ప్రతి పౌరుడు తన ఇంటి పైన మువ్వన్నెల జెండాను ఎగుర వేయాలని కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా హర్ ఘర్ తిరంగా కార్యక్ర మాల పై సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేసారు. జిల్లాలో జాతీయ జెండాతో సెల్ఫీలు తీసుకొని సంబంధిత వెబ్‌సైట్‌లో నమో దు చేయాలన్నారు. తొలుత రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఇంటింటిపై జాతీయ జెండా ఎగుర వేసే కార్యక్రమం జయప్రదంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పుష్పమణి, జెడ్పి సిఇఓ సుబ్బారావు, డిఎస్‌డివో బి. శ్రీనివాసరావు, సెట్ వెల్ సిఇఓ మధుభూషణరావు, జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం పాల్గొన్నారు.

జాతీయస్థాయి కుంగ్ఫు, కరాటే పోటీల్లో ఆలమూరు విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర – ఆలమూరు : ఇటీవల విజయవాడ పటమట రామకోటేషన్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి కుంగ్ఫు కరాటే పోటీలలో మండల కేంద్రమైన ఆలమూరు గ్రామానికి చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు గోల్డెన్ డ్రాగన్ చైనీస్ సీనియర్ మాస్టర్ నర్గాని చంద్ర కుమార్ తెలిపారు. వివరాలు ప్రకారం ఫైటింగ్ జూనియర్స్ విభాగంలో మన్విత్ నాయక్ గోల్డ్ మెడల్, సబ్ జూనియర్ (ఏ) విభాగంలో జస్వంత్ నాయక్ సిల్వర్ మెడల్, వైట్ బెల్ట్ ఫైటింగ్ (బి)విభాగంలో క్రిశాంత్ నాయక్ సిల్వర్ మెడల్ సాధించారన్నారు. తక్కువ సమయంలో అత్యంత ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులు స్థానిక ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఎస్సై శ్రీను నాయక్ కుమారులు కావడం విశేషం అన్నారు. ఈ మేరకు విజేతలుగా గెలుపొందిన విద్యార్థులను స్థానిక మార్షల్ ఆర్ట్స్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు, గ్రాండ్ మాస్టర్ టి అబ్బులు, మాస్టర్ కర్రీ సత్తిబాబు, చల్లా సుధీర్ కుమార్, డిపి రావు, తదితరులు అభినందించారు.

జాతీయ స్ఫూర్తితో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర – తూర్పుగోదావరి : హర్ ఘర్ తిరంగ వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ విభాగాలను భాగస్వామ్యం చేసేలాగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలియజేశారు. బుధవారం జిల్లా డివిజన్ మండల స్థాయి అధికారులతో "హర్ ఘర్ తిరంగ" కార్యక్రమం నిర్వహణపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సూచన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని, స్వాతంత్ర స్ఫూర్తిని పెంపొందించేలాగా కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల ఫోటోలను "హర్ ఘర్ తిరంగ" వెబ్సైట్ లో అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు. దేశం కోసం నిస్వార్థంగా పనిచేసిన స్వాతంత్ర సమరయోధులకు ఘనమైన నివాళులు అర్పించే విధానంలో యువతలో, ప్రజల్లో స్ఫూర్తి పొందే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని, వాటి ఫోటోలను టూరిజం అధ్వర్యంలో వెబ్సైట్ లో అప్లోడ్ చేయాలన్నారు. వైద్య ఆరోగ్య, మునిసిపల్ కార్పొరేషన్, పురపాలక సంఘాలు, గ్రామ పంచా యతీలు, జిల్లా, డివిజన్, మండల స్థాయి కార్యాలయాలలో వేడుకలను నిర్వహించాలన్నారు. శానిటరీ వర్గాలు, స్ట్రీట్ వెండర్స్, డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది, కార్యకర్తలు, ఉపాధి హామీ వేతన దారులు క్షేత్ర స్థాయిలో, వివిధ కమ్యూనిటీ, యూనియన్స్ లతో స్వచ్ఛంద సంస్థల తో కూడిన బృందాలుగా ఏర్పడి సెల్ఫీలు తీసుకుని హర్ ఘర్ తిరంగా వెబ్ సైట్ లో అప్లోడ్ చెయ్యాలని పిలుపు ఇచ్చారు. వివిధ శాఖల మండలాలలో జరిగే కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయడంతో పాటు స్ఫూర్తివంతమైన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అదే విధంగా ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జెండా ఆవిష్కరణ ఫొటోలు తీసుకుని జాతీయ స్ఫూర్తి పెంపొందించేలా ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లా అధికారులు క్షేత్ర స్థాయి అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడదాం

అధికారులకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పిలుపు

విశాలాంధ్ర – గోపాలపురం : ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడదామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కే రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రజా ప్రతినిధులను అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ముందుగా పలు శాఖల అధికారుల పనితీరుపై సర్పంచులను ఎంపీటీసీలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై సగ్గొండ సర్పంచ్ ఎండపల్లి కవిత శేఖర్ బాబు మాట్లాడుతూ గోపవరంలోని ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థలో ఉందని గత ఐదు సంవత్సరాలుగా విద్యాశాఖ అధికారుల దృష్టికి ప్రతి సర్వసభ్య సమావేశంలో తీసుకొచ్చినప్పటికీ ఫలితం శూన్యమని ఎమ్మెల్యే మద్దిపాటి దృష్టికి తీసుకుని వెళ్లారు. తక్షణమే స్కూల్ భవనాల నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. రాజంపాలెం సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు ఇండ్ల స్థలాల ప్రాంతంలో వేయమని కోరాము కానీ నేటికీ విద్యుత్ శాఖ అధికారులు పనిచేయలేదని తెలిపారు. కొన్ని గ్రామాలలో రక్షిత మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయని పంచాయతీ రాజ్ శాఖ ఒక పనిని కూడా చేయలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పలువురు సర్పంచులు వివిధ సమస్యలపై సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ ప్రతి గ్రామం లోనూ అభివృద్ధి ప్రస్ఫుటంగా కనిపించేటట్లు కనీ సం రూ.10 లక్షల అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు భాస్కం రావు, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జడ్పిటిసి లలిత, టీడీపీ మండల అధ్యక్షుడు, కార్యదర్శులు సత్యనారాయణ, రమేష్, రాము, శ్రీధర్ సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

సొంత గ్రామానికి డ్వాక్రా ఖాతాలు తరలించాలి

విశాలాంధ్ర – ఆలమూరు : ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు తమ సొంత గ్రామంలో ఉన్న యూనియన్ బ్యాంకుకు డ్వాక్రా ఖాతాలను మార్చాలని కోరారు. ఈ మేరకు బుధవారం గ్రామంలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్ వై అజయ్ ప్రభు కుమార్‌కు స్థానిక టిడిపి నేతలు తాడి శ్రీనివాస్ రెడ్డి (బట్టి శ్రీను), గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబి) ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ తమ గ్రామంలో సుమారుగా 6000 మంది జనాభా కలిగి ఉండి చిన్న, సన్నకారు వ్యాపారస్తులుగా ఎంతోమంది జీవిస్తున్నామన్నారు. గత 35 సంవత్సరాల నుండి నేటి వరకు సుమారు 150 సంఘాలుగా ఏర్పడి 1500 మంది సభ్యులు మండల కేంద్రమైన ఆలమూరు గ్రామంలో గల యూనియన్ బ్యాంకులో ఖాతాలు ఏర్పరచుకుని ఋణాలను పొందుతూ తగు సమయంలో బ్యాంకు వారికి సహకరిస్తూ చెల్లింపులు చెల్లిస్తున్నామన్నారు. అయితే 2016 సంవత్సరంలో మా గ్రామంలో ప్రజల అవసరాలను తెలుసుకొని యూనియన్ బ్యాంక్ వారు నూతన బ్రాంచ్ ని ప్రారంభించినప్పటికీ తగు ప్రయోజనంలేదన్నారు. ఈ డ్వాక్రా లావాదేవీల చెల్లింపులు చెల్లించడానికి మహిళలు, వృద్ధులు ఆలమూరు చేరుకోవడానికి సరైన రవాణా సౌకర్యములు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ సమస్యను పలుమార్లు బ్యాంకు వారికి తెలియజేసినప్పటికీ పరిష్కార మార్గం లభించలేదన్నారు. ఎప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తారని కోరారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి శ్రీనివాస్, సత్తి శ్రీనివాసరెడ్డి (మాచవరం శ్రీను), సత్తి శ్రీనివాసరెడ్డి, పలువురు డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

78వ స్వాతంత్ర్య వేడుకలకు ఏలూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్ సిద్ధం

– జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి కొలుసు పార్థసారధి

విశాలాంధ్ర – ఏలూరు : ఏలూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహిస్తున్న 78వ స్వాతంత్ర్య దినో త్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబం ధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి హాజరు కాను న్నారు. ఈ వేడుకలలో గురువారం ఉదయం గం. 8.45లకు ముఖ్య అతిధి ఆగమనం, గం.9లకు మంత్రి కొలుసు పార్థసారధి జాతీయ పతాక ఆవిష్కరణ చేస్తారు. అనంతరం గం. 9.05 లకు ముఖ్య అతిథి వారిచే పోలీస్ గౌరవ వందన స్వీకరణ, పోలీసు పెరేడ్ గ్రౌండ్ సందర్శన, గం. 9.15లకు ముఖ్య అతిథి వారి సందేశం, గం. 9.30 పోలీస్ కవాతు ఉంటుంది. గం. 10లకు వివిధ శాఖల ప్రగతి శకటాల ప్రదర్శన, గం.10.20లకు వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన, ఉదయం గం.10.40లకు విద్యార్థినీ, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. గం.11.15లకు ప్రశంసాపత్రాల ప్రదానం, గం.11.45కు జాతీయ గీతాలాపన కార్యక్రమాలు ఉంటాయి.